

ప్రజలపై పన్నుల భారాన్ని నిరసిస్తూ అన్నాడీఎంకే తరఫున మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా మానవహారం నిర్వహించారు. సేలంలో మాజీ మంత్రి సెమ్మలై నేతృత్వంలో డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. -సైదాపేట, న్యూస్‌టుడే

## అసెంబ్లీ ఎన్నికలకు డీఎంకే పరిశీలకుల నియామకం

**వేళచ్చేరి, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 234 నియోజకవర్గాలకు పరిశీలకులను డీఎంకే అధ్యక్షుడు సీఎం స్టాలిన్ మంగళవారం నియమించారు. పార్టీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో.. పరిశీలకులు నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలను సరిచూడటం, కొత్తగా చేర్చడం, తొలగించడం, బూత్ కమిటీల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలకులు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

## అన్నాడీఎంకే నుంచి తళవాయ్ సుందరం తొలగింపు

**సైదాపేట, న్యూస్‌టుడే:** అన్నాడీఎంకే మాజీ మంత్రి తళవాయ్ సుందరాన్ని పార్టీలోని అన్ని బాధ్యతల నుంచి తొలగిస్తూ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ప్రకటించారు. పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలు, నియమాలకు విరుద్ధంగా వ్యవహరించినందున మాజీ మంత్రి తళవాయ్ సుందరాన్ని ఆయన వహిస్తున్న సంస్థాగత కార్యదర్శి, కన్నియాకుమరి తూర్పు జిల్లా కార్యదర్శి తదితర అన్ని బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు వెల్లడించారు.



# 14న నేరుగా హాజరవ్వండి

**చెన్నై పోలీస్ కమిషనర్‌కు మానవహక్కుల కమిషన్ సమన్లు**

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** చెన్నై పోలీస్ కమిషనర్‌గా అరుణ్ బాధ్యతల స్వీకరణ సమయంలో రౌడీలకు అర్థమయ్యే భాషలో వారితో మాట్లాడుతానని అన్నారు. దాని అర్థం తెలియజేయాలని రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ఆయనకు సమన్లు పంపింది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ చెన్నై పెరంబూర్ ప్రాంతంలో జూన్‌లో దారుణహత్యకు గురైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చెన్నై పోలీస్ కమిషనర్‌ను బదిలీ చేయగా ఆయన స్థానంలో అరుణ్ నియమితులయ్యారు. ఆయన బాధ్యతలు అందుకునేటప్పుడు రౌడీలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ ప్రకారం పరారీలో ఉన్న కొందరు రౌడీలు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. తిరువొత్తియూర్ ఏసీపీ ఇళంగోవన్ కొద్దిరోజుల కిందట అక్కడి ఓ రౌడీ ఇంటికి వెళ్లి నేరాలు ఆపాలని, లేదంటే కాళ్లు, చేతులు విరగ్గొడతామని హెచ్చరించినట్లు ఓ వీడియో సామాజిక మాధ్యమంలో విడుదలైంది. రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సుమోటోగా ఇళంగోవన్‌పై కేసు నమోదుచేసింది. ఇందుకు సంబంధించి ఇళంగోవన్ సోమవారం కమిషన్ కార్యాలయంలో నేరుగా హాజరై వివరణ ఇచ్చారు. రౌడీలకు అర్థమయ్యే భాషలో మాట్లాడతానని అరుణ్‌కు చెప్పడంపై 14న నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని మానవహక్కుల కమిషన్ సమన్లు పంపింది.

# మేలిమిబాటలు..



చెన్నైలో నడకదారుల అవసరం చాలా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే వృద్ధి చేసినా.. ఇంకా అవసరం కనిపిస్తోంది. నడకదారులు నిర్మించడంతోపాటు వాటి నిర్వహణతోపాటు పలు విషయాలపై అధికారులు దృష్టిసారించాల్సి ఉంటుందని తాజాగా విడుదలైన సర్వే నివేదిక తెలియజేస్తోంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ డెవలప్‌మెంట్ పాలసీ (ఐటీడీపీ) చేసిన ఈ సర్వేలో చాలా విషయాలు వెల్లడయ్యాయి.

నడకదారులతో తగ్గిన వాహనాల వినియోగం

కాలుష్యం తగ్గిస్తున్నట్లు సర్వేలో వెల్లడి

అన్ని ప్రాంతాలకు విస్తరించాలంటున్న ప్రజలు

ఈనాడు-చెన్నై

చెన్నై నగరంలో నడకదారులకు పెట్టిన డబ్బులు వృథాగా పోలేదని సర్వే ద్వారా వెల్లడైంది. ఖర్చుచేసిన ప్రతి రూ.కోటికి కనీసంగా 2.6 టన్నుల నుంచి 7.6 టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గాయని ఐటీడీపీ అంచనా వేసింది. వాహనాలు వదిలేసి ప్రజలు నడకదారుల్లోకి రావడం ద్వారా ఏటా పీఎం 2.5 కాలుష్య కారకాలు 150 కిలోల నుంచి 680 కిలోల దాకా తగ్గాయని చెప్పింది. పాదచారులు నడక ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో ఏటా 340 మరణాల తగ్గినట్లు చూపారు. ఈ సర్వే ద్వారా నగరవ్యాప్తంగా నడకదారులు వృద్ధి చేయాల్సిన అవసరం వ్యక్తమవుతోంది.

### వాహనాలు వదిలేస్తున్నారు..

చెన్నైలో నడకదారులు బాగుచేసిన 4 ప్రాంతాల్లో ఐటీడీపీ ప్రతినిధులు పరిశీలన చేశారు. టీనగర్‌లోని పాండీబజార్, చెట్‌పేట్‌లోని హరింగ్టన్ రోడ్, తరమణిలోని సీఎస్ఐఆర్ రోడ్డు, అన్నానగర్‌లోని సెకండ్ అవెన్యూ రోడ్లలో 424 మంది పాదచారులతో మాట్లాడారు. ప్రత్యేక యాప్‌ల ద్వారా వారి నడకను సైతం కొన్నాళ్లపాటు పరిశీలించారు. తాజా నివేదిక ప్రకారం.. ఆయా ప్రాంతాల్లోనివారు నడకదారుల్లో రోజుకు సగటున 14,670 అడుగులు వేస్తున్నట్లు గుర్తించారు. చక్కటి నడకదారులు రావడం ద్వారా ఆయా ప్రాంతాల్లో 9శాతం నుంచి 29 శాతం ప్రజలు తమ మోటారువాహనాల్ని వదిలి నడక సాగించినట్లు స్పష్టత ఇచ్చారు. ఫలితంగా ఏటా కర్బన ఉద్గారాలు 4వేల టన్నుల నుంచి 12వేల టన్నుల దాకా తగ్గుముఖం పడుతున్నట్లు అంచనా వేస్తున్నామని సర్వే సంస్థ తెలిపింది. అంటే.. రోడ్లపై సుమారుగా 1000 నుంచి 2900 కార్లు తగ్గినట్లేనని వెల్లడించింది.

### రక్షణగా ఉన్నాయి..

మహానగరంలో నడకదారులు వృద్ధి చేయడం ద్వారా నేరాల ప్రవృత్తి అదుపుచేసే అవకాశాలున్నాయని ఐటీడీపీ వెల్లడిస్తోంది. ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి, పాదచారుల్ని గాయాల నుంచి తప్పించే అవకాశాలు ఎక్కువని వివరించారు. పిల్లలకు కూడా ఎంతో సౌకర్యంగా ఉన్నాయనే అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తపరిచారు. రాత్రి 10గంటల తర్వాత సైతం నడకదారులు సురక్షితంగా ఉన్నాయని పాండిబజార్, సీఎస్ఐఆర్ రోడ్డువాసులు వ్యక్తం చేయగా.. హరింగ్టన్ రోడ్డు, అన్నానగర్ సెకండ్ అవెన్యూవాసులు మాత్రం ఫర్వాలేదని సమాధానమిచ్చారు. అన్నానగర్‌వాసులు అక్కడి నడకదారులు పిల్లలకు యోగ్యంగా లేవని చెప్పారు.



### ఎందుకు వాడుతున్నారు..

| | |
|---|---|
| కూర్చోవడానికి | - 22శాతం |
| కలిసి నడవటానికి | - 38శాతం |
| వ్యాయామాలకు | - 12శాతం |
| ఆటలకోసం | - 4శాతం |
| తినడానికి | - 18శాతం |

### ఇబ్బందులివీ..

| కారణం | వెల్లడించిన వ్యక్తుల శాతం |
|---|---|
| విద్యుద్దీపాల సమస్య | 55 |
| నడిచేవారు లేకపోవడం | 90 |
| పురుషాధిక్యత | 20 |
| పోలీసులు కనిపించకపోవడం | 10 |
| అసాంఘిక కార్యకలాపాలు | 15 |
| వాహనాలు పార్కింగ్ చేయడం | 45 |
| ప్రమాదకర వాహనాలు వస్తుండటం | 20 |

### గాయాలూ ఎక్కువే..

ఫుట్‌పాత్‌లు సరిగా లేక చాలాచోట్ల పాదచారులు గాయాలపాలైనట్లు సర్వేలో తేలింది. 20చోట్ల ఇలా జరిగినట్లు వెల్లడించారు. అధికారులు అప్రమత్తమై పలు నడకదారులు బాగుచేసిన తర్వాత కూడా 18మంది గాయపడినట్లు సర్వే వెల్లడించింది. బాగుచేయనప్పుడు వాహనాల వేగం కారణంగా పలువురు గాయపడగా, బాగుచేసిన తర్వాత.. నాణ్యత సరిగా లేక గాయాలపాలయ్యారు. ఎక్కువ ప్రమాదాలు హరింగ్టన్ రోడ్డు, సీఎస్ఐఆర్, అన్నానగర్‌లో ఉన్నాయి.

### వ్యాయామం..

- నడకదారులు బాగుచేసిన తర్వాత ప్రజల్లో ఆరోగ్య ప్రధాన కార్యక్రమాలపై దృష్టి పెరిగిందని సర్వే వెల్లడించింది. ప్రధానంగా నడక, సైక్లింగ్, వ్యాయామం తదితరాలు అలవడుతున్నట్లు వివరించింది.
- 12శాతం మంది ప్రజలు ఆర్థికంగానూ లాభపడినట్లుగా తేలింది. వాహనాల్ని వాడకపోవడంతో ఖర్చు తగ్గిందన్నారు.

### మెరుగ్గా ఉంటే..

- ఇప్పటికీ 70శాతం మంది మోటారు వాహనాలపైనే ఆధారపడుతున్నట్లు సర్వే ద్వారా తేలింది. మెరుగైన నడకబాటలుంటే వారి శాతం కూడా తగ్గుముఖం పట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడిస్తున్నారు.
- నడకదారులు బాగుంటే తామూ అటుగా వెళ్లేవారమని 6 శాతంమంది మహిళలు, ఒక శాతం మంది పురుషులు అభిప్రాయపడ్డారు.

### ఇంకా ఏం కోరుకుంటున్నారు

- శుభ్రత అవసరం.
- పార్కింగ్ నిర్వహణ బాగుండాలి.
- నడకదారులు అనుసంధానం తప్పనిసరి.
- నడిచేందుకు ఉపరితలం బాగుండాలి.
- నీడనిచ్చే ఏర్పాట్లు అవసరం.
- వీధులు దాటేచోట్ల రక్షణ కావాలి.
- వేగంగా వెళ్లే వాహనాల బారినపడకుండా ఉండాలి.
- పక్కనే మరుగుదొడ్లుండాలి.
- కూర్చునే ఏర్పాట్లుండాలి.
- రాత్రిళ్లు వెలుతురు తప్పనిసరి.
- తాగునీటి సౌకర్యం కల్పించాలి.
- నడిచేందుకు వెడల్పైన బాటలు అవసరం.
- పాదబాటలపై దుకాణాల్ని నియంత్రించాలి.

# 14 ప్రాజెక్టులకు ఆమోదం

## స్టాలిన్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం

**వేళచ్చేరి, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో రూ.38,698.80 కోట్ల విలువైన 14 కొత్త ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తద్వారా 46,931 మంది ఉపాధి పొందుతారని ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు, పరిశ్రమలశాఖ మంత్రి టీఆర్బీ రాజా తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో మంగళవారం చెన్నై సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింగది. అనంతరం మంత్రులు విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టుల్లో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల తయారీ(పీసీబీ), తక్కువ ఓల్టేజీ ప్యానెళ్లు, డిస్‌ప్లే కాంపోనెంట్స్, మొబైల్ ఉత్పత్తుల కేసింగ్, ప్యాసింజర్ లగ్జరీ వెహికల్ తయారీ, ఆటోమోటివ్ విడిభాగాలు, హైటెక్ పరికరాలకు సాఫ్ట్‌వేర్, రక్షణ పరికరాలు, మెడికల్ ఇంజెక్టబుల్స్, ఇతర రంగాలు ఉన్నాయని వివరించారు.



సమావేశంలో సీఎం స్టాలిన్, మంత్రులు


- ఫార్మా, నాన్-లెదర్ ఫుట్‌వేర్ తయారీ, గ్రీన్‌హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి, ఎలక్ట్రిక్ వాహనాలు, టెలీ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లపై పరిశోధన, అభివృద్ధి తదితరమైనవి కూడా ఉన్నాయన్నారు.
- రాణిపేట జిల్లాలో టాటా మోటార్స్ లిమిటెడ్ రూ.9వేల కోట్ల పెట్టుబడితో 5వేల మందికి, ఫాక్స్‌కాన్ గ్రూప్ అనుబంధ సంస్థ యుసాన్ టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.13,180 కోట్ల పెట్టుబడితో 14వేల మందికి, కాంచీపురం జిల్లా, తూత్తుకుడి, విరుదునగర్, తిరునెల్వేలి, రామనాథపురం, తిరువణ్ణామలై జిల్లాల్లో పీఎస్‌జీ అనుబంధ సంస్థ లీఫ్ గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.10,375 కోట్ల పెట్టుబడితో 3వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.
- అరియలూర్ జిల్లాలో తైవాన్ దేశానికి చెందిన టీన్ షూస్ అనుబంధ సంస్థ, ఫ్రీ ట్రెండ్ ఇండస్ట్రియల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.1000 కోట్ల పెట్టుబడితో 15 వేల మందికి, కాంచీపురం జిల్లాలో కేన్స్ సర్క్యూట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరఫున రూ.1,395 కోట్ల పెట్టుబడితో 1033 మందికి, అసెంట్ సర్క్యూట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.612.60 కోట్లతో 1200 మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

# ఐఐటీఎంలో నూతన పరిశోధన కేంద్రం

**వడపళని, న్యూస్‌టుడే:** దేశంలో సైబర్ నేరాలను నియంత్రించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్(ఐఐటీఎం) మంగళవారం నూతన పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించింది. బ్లాక్ చెయిన్, ఏఐ విధానంలో చేపట్టాల్సిన జాగ్రత్తలు, క్రిప్టోగ్రఫీ, క్వాంటమ్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) భద్రతపై ఈ కేంద్రం పరిశోధనలు చేస్తుంది. ఐఐటీ డైరెక్టరు, ఆచార్యులు వి.కామకోటి మాట్లాడుతూ దేశంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతోందని, నేరగాళ్లు ఆర్థికంగా లబ్ధి పొందడమే కాకుండా, సంస్థల భద్రతకు భంగం కలిగే ప్రమాదం ఉందన్నారు. ఈ కేంద్రం అంతర్జాతీయ, దేశంలోని పరిశ్రమలు, పరిశోధన సంస్థలు, విద్యాసంస్థలతో కలిసి సేవలందిస్తుందన్నారు. ఆచార్యులు శ్వేతా అగర్వాల్, జాన్ అగస్టిన్, చెస్టర్ రెబెయిరోతో పాటు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ), ఆచార్యులు, సైమన్స్ ఇన్‌స్టిట్యూట్ రీసెర్చి డైరెక్టరు, షఫి గోల్డ్‌వాస్సెర్, ఐఐటీ ఖరగ్‌పూర్ కంప్యూటర్ సైన్స్ విభాగ ఛైర్ ప్రొఫెసర్ డేవ్ దీప్‌ముఖోపాధ్యాయ కీలక ప్రసంగాలు చేశారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐఐటీఎం ఆచార్యులు వి.కామకోటి



భారత వాయుసేన 92వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తాంబరం ఎయిర్‌ఫోర్స్ కేంద్రంలో గౌరవవందనం స్వీకరిస్తున్న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్‌సింగ్

ఫైటర్ జెట్ ప్రదర్శన..

ఎయిర్‌షోలో పాల్గొన్న విమానాలను తిలకిస్తున్న ప్రజలు

తుపాకీతో విన్యాసాలు

వాయుసేన కవాతు

# రూ.12 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీ

## పుదువై ముఖ్యమంత్రి రంగసామి

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** పుదుచ్చేరిలో దీపావళి ముందు రూ.12 కోట్లు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రంగసామి తెలిపారు. తొండమందం గ్రామంలో రూ.2.55 కోట్లతో 5లక్షల లీటర్లు, 2.50 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులను కొత్తగా నిర్మించారు. వాటిని ఎల్జీ కైలాష్‌నాథన్, ముఖ్యమంత్రి రంగసామి, స్పీకర్ సెల్వం, మంత్రి సాయి శరవణకుమార్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ తాగునీటి పథకాలకు 2015లో శంకుస్థాపన చేశామని, ఇప్పుడు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పుదుచ్చేరిలో అందరికీ శుభ్రమైన తాగునీరు అందిస్తామని చెప్పారు. రూ.450 కోట్లతో సముద్ర జలాలను తాగునీటిగా మార్చే పథకాన్ని అమలు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో రోజుకు ఒకరికి 70 లీటర్లు, నగరంలోని 140 లీటర్ల నీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పుదుచ్చేరిలో రైతులు తీసుకున్న రుణాలు రూ.13కోట్లు అని, ఇందులో మొదటి విడతగా దీపావళి ముందుగా రూ.12కోట్లు మాఫీ చేస్తామని చెప్పారు. దివ్వెల పండుగకు ముందే రేషన్ దుకాణాలు తెరిచి ఉచితంగా బియ్యం, ఇతర సరుకులు అందిస్తామన్నారు.



తాగునీటి ప్రాజెక్టును ప్రారంభిస్తున్న ఎల్జీ కైలాష్‌నాథన్

## మెరీనా ఈత కొలను ప్రారంభం



ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు

**సైదాపేట, న్యూస్‌టుడే:** మెరీనా ఈత కొలనును ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మంగళవారం ప్రారంభించారు. కొలనును రూ.1.37 కోట్లతో పునరుద్ధరించారు. ప్రజలు ఈతకొట్టేందుకు సమయం నమోదు, ఆన్‌లైన్ ద్వారా రుసుము చెల్లించేందుకు క్యూఆర్ కోడ్ సేవను కూడా అందుబాటులోకి తెచ్చారు. మంత్రులు కేఎన్.నెహ్రూ, మా.సుబ్రమణియన్, శేఖర్‌బాబు, ఎంపీ దయానిధి మారన్, మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## కేసరి మహోన్నత పాఠశాలలో
# అల్పాహార పథకం

**వడపళని, న్యూస్‌టుడే:** చెన్నై టీనగర్ కేసరి మహోన్నత పాఠశాలలో సోమవారం నుంచి 10, 11, 12 తరగతి విద్యార్థులకు సాయంవేళ అల్పాహారం అందిస్తున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు, ప్రతిభా పాటవాలు మెరుగు పడేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు అల్పాహారం అందించే పథకాన్ని 'కెన్సెస్' సంస్థ అధినేత నర్సిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. 90శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.లక్ష బహుమానంగా అందిస్తానని నర్సిరెడ్డి హామీ ఇచ్చారు. సమయాన్ని వృథా చేయకుండా మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో చదవాలని పిలుపునిచ్చారు. నర్సిరెడ్డిని ప్రధానోపాధ్యాయుడు నాగుల గోపాలయ్య శాలువాతో సత్కరించారు. కార్యవర్గ సభ్యులు కృష్ణారావు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



అల్పాహారం అందిస్తున్న నర్సిరెడ్డి, నాగుల గోపాలయ్య తదితరులు

# మహారాణిగా కన్యకా పరమేశ్వరి

**వడపళని, న్యూస్‌టుడే:** జార్జిటౌన్ శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం చతుర్వేద పారాయణాలు, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. సాయంత్రం మూలవిరాట్టును బంగారు ఆభరణాలతో, ఉత్సవమూర్తిని గజవాహనంపై మహారాణిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కీరవాణి, ప్రియదర్శిని, సాయి రాగమాలిక ట్రస్టు సభ్యుల భక్తి గీతాలాపన, లలితా సహస్రనామ బృంద పారాయణం, వినయ గాత్ర కచేరి అలరించాయి. మంగళవారం ఉత్సవానికి డాక్టర్ జి.విజయకుమార్ కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. పాలక మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మహారాణి అలంకరణలో అమ్మవారు

# తిరుప్పూర్‌లో పేలుడు

- ముగ్గురి మృతి
- 10 ఇళ్లు ధ్వంసం

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** తిరుప్పూర్‌లో నాటుపేలుడు మందు పేలడంతో చిన్నారి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... పెరుమానల్లూర్ పాండియన్‌నగర్‌లోని సత్యకాలనీలో కార్తి అనే వ్యక్తి ఇల్లుంది. ఆలయాల వేడుకలకు బాణసంచా, పేలుడు పదార్థాలు తయారుచేసి ఇస్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. కార్తి ఇల్లు పూర్తిగా నేలమట్టమవగా పక్కనే ఉన్న 10 గృహాలు ధ్వంసమయ్యాయి. 9 నెలల చిన్నారి, మరో ఇద్దరు మృతి చెందారు. 8మందికి పైగా తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మంటలు అదుపు చేశారు. నిల్వ చేసిన పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలిస్తున్నారు.



ధ్వంసమైన ఇల్లు, ఘటనా స్థలంలో స్థానికులు

### చట్ట విరుద్ధంగా తయారీ..

తిరుప్పూర్ పోలీస్ కమిషనర్ లక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ...కార్తి, అతని భార్య సత్యప్రియ, ఆమె సోదరుడు శరవణకుమార్ కలిసి ఆలయాల ఉత్సవాలకు పేలుడు పదార్థాలను తయారు చేస్తుంటారని తెలిపారు. కుమార్(25) అనే వ్యక్తి శరీరం పూర్తిగా ఛిద్రమవగా, అలియా షరీన్(9నెలలు), సత్యప్రియ(30) మృతి చెందారన్నారు. శరవణకుమార్‌కు బాణాసంచా తయారీ లైసెన్స్ ఉందని, ఇక్కడ తయారుచేయడం చట్టవిరుద్ధమని చెప్పారు. కలెక్టర్ క్రిస్తురాజ్ మాట్లాడుతూ. ధ్వంసమైన ఇళ్లు పరిశీలిస్తున్నామని, ఆర్థికసాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి మా.సుబ్రమణియన్

## వెయ్యిచోట్ల వైద్య శిబిరాలు 15న

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** రాష్ట్రవ్యాప్తంగా 15వ తేదీ వెయ్యి చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నామని ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ తెలిపారు. చెన్నై సైదాపేట లేబర్ కాలనీలో మంగళవారం నిర్వహించిన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... ఈశాన్య రుతుపవనాల వర్షాలను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ఆరోగ్యశాఖ సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం జ్వరాల ప్రభావం అధికంగా ఉందన్నారు. అందుకే అనేక చోట్ల వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 15వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి చోట్ల నిర్వహిస్తామని తెలిపారు. అందులో చెన్నైలో వంద, ఇతర జిల్లాల్లో 900 ఉంటాయన్నారు. మక్కల్ తేడి మరుత్తువం పథకం ద్వారా 2 కోట్ల మంది వరకు లబ్ధిపొందారని చెప్పారు. పథకానికి ఐక్యరాజ్యసమితి ప్రశంసలు దక్కాయని, డెంగీ నియంత్రణకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ ఏడాది ఏడుగురు మాత్రమే డెంగీతో చనిపోయారన్నారు. ప్రజలు తమ ఇళ్ల చుట్టూ నీరు నిలవకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# పెద్ద చదువులో పేద విద్యార్థులు

◆ ఎంబీబీఎస్ సీట్లు సాధించిన సర్కార్ బడుల పిల్లలు ◆ 19 పాఠశాలల నుంచి ఎంపిక



- న్యూస్‌టుడే, వడపళని

రాష్ట్రంలో 19 ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 'ఎంబీబీఎస్' సీట్లు లభించాయి. 2023 సంవత్సరానికి గాను 7.5 శాతం రిజర్వేషన్‌తో 680 మంది వైద్య కోర్సుల్లో చేరారని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టొరేట్ పేర్కొంది. 2023లో రాష్ట్ర కోటా కింద 8,316 సీట్లు ఖాళీ ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇందులో 683 ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు 7.5శాతం కేటాయించారు. ఇవికాకుండా ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 78 మందికి వేర్వేరు వైద్య కళాశాలల్లో ప్రభుత్వ కోటా, స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో సీట్లు దక్కాయని సీనియర్ అధికారి ఒకరన్నారు.

### సీబీఎస్ఈ సిలబస్‌కు ధీటుగా..

రాష్ట్ర బోర్డు సిలబస్‌తో చదివిన వారిలో అధిక శాతం మంది సీబీఎస్ఈకి తీసిపోని విధంగా ఉన్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. సీబీఎస్ఈ విద్యార్థులు 4,140 మందికి ఎంబీబీఎస్‌లో సీట్లు రాగా, 4,030 మంది రాష్ట్ర బోర్డు విద్యార్థులు కూడా వైద్య కోర్సుకు సీట్లు సాధించుకోగలిగారు. 39 మంది విద్యార్థులు ఇతర బోర్డుకు చెందిన వారు. విద్యార్థులు ప్రయివేటుగా 'నీట్' శిక్షణ తీసుకున్నారా? అనే దానిపై సమాచారం సేకరించాల్సి ఉందని డైరెక్టరేట్ పేర్కొంది. చాలా మంది అలాంటిదేమీ లేదని అంటున్నారని అధికారి ఒకరు చెప్పారు.

### రెండో కౌన్సెలింగ్‌లోనే..

78 మందిలో దివ్యాంగుల కోటాలో నలుగురు, ప్రభుత్వ కళాశాలల్లో తొమ్మిది, స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో ఆరుగురు చేరారు. మిగిలిన 59మంది బీడీఎస్ కోర్సులో చేరారు. ఒకరికి మాత్రమే ప్రభుత్వ కళాశాలలో చేరే అవకాశం కలిగింది. గత నాలుగేళ్లుగా ప్రభుత్వ బడుల్లో చదువుతున్న వారిలో కూడా నైపుణ్యాలు బాగా కనిపిస్తున్నాయని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. నీట్ వచ్చిన తర్వాత వైద్య కళాశాలల్లో చేరే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్య తగ్గింది. అన్ని రకాల కేటగిరీలకు కటాఫ్ కూడా పెరగడంతో ఈ ఏడాది ప్రవేశాలకు సవాలుగా మారింది. రెండోసారి కౌన్సిలింగ్‌కు హాజరైనవారి శాతం కూడా ఎక్కువైంది. ఈ ఏడాది రెండో రౌండులో జరిగిన కౌన్సెలింగులో టాప్ పది అభ్యర్థులు 7.5శాతం రిజర్వేషన్ కోటాలో ఉన్నవారే. సగటుగా ప్రభుత్వ బడుల నుంచి మళ్లీ కౌన్సెలింగుకు వచ్చిన వారు 80శాతం వరకున్నారు.



ముఖ్యమంత్రి స్టాలిన్‌ను సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.కన్నయ్య మర్యాద పూర్వకంగా కలిసిన దృశ్యం - వేళచ్చేరి, న్యూస్‌టుడే

## దసరాకు 2 వేల ప్రత్యేక బస్సులు

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** ఆయుధపూజ, విజయదశమి పండుగలకు సొంతూర్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రభుత్వ రవాణా సంస్థలు ప్రత్యేక బస్సులు నడపనున్నాయి. కోయంబేడు, కిళాంబాక్కం, మాధవరం బస్టాండ్ల నుంచి 2092 బస్సులు ఎప్పటిలానే నడుస్తాయని, బుధవారం అదనంగా 500 ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. 10వ తేదీ ఎక్కువమంది ప్రయాణాలు చేస్తుండటంతో ఆరోజు 2వేల ప్రత్యేక బస్సులు అదనంగా నడపనున్నట్లు తెలిపారు. బుధవారం ప్రయాణానికి 13 వేలమంది రిజర్వేషన్ చేసుకోగా, 10న 31 వేలమంది చేసుకున్నట్లు వెల్లడించారు. చెన్నై నుంచే 18 వేలమంది రిజర్వేషన్ చేసుకున్నారు.





రోహిణీ శ్రీనాథ్ భక్తి గీతాలాపన ◆ కళాకారులకు జ్ఞాపికలు అందిస్తున్న గవర్నరు దంపతులు

## రాజ్‌భవన్‌లో నవరాత్రి సంబరాలు

**వడపళని, న్యూస్‌టుడే:** రాజ్‌భవన్‌లో జరుగుతున్న దసరా నవరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం రోహిణీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన, శివాస్ అకాడమీ బృందం నాట్య ప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమంలో గవర్నరు ఆర్ఎన్ రవి దంపతులు పాల్గొని కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

## ఉప ముఖ్యమంత్రి పార్టీ గుర్తున్న చొక్కాలు ధరించకూడదు

**టీఎంసీ**

**వేళచ్చేరి, న్యూస్‌టుడే:** ప్రభుత్వ కార్యక్రమాల్లో ఉదయనిధి స్టాలిన్ పార్టీ గుర్తు, జెండా ఉన్న టీషర్టుతో పాల్గొనడం సరికాదని టీఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యువరాజ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న ఉదయనిధి స్టాలిన్ ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ గుర్తు, జెండా ఉన్న టీషర్టులతో పాల్గొనడం సరికాదన్నారు. బాధ్యతాయుత పదవిలో ఉన్న ఆయన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నపుడు పార్టీ గుర్తు ఉన్న టీషర్టు ధరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. న్యాయమూర్తులు, పోలీసులు మీలాగే టీషర్టులు ధరించి విధుల్లో పాల్గొంటే అంగీకరిస్తారా? అని ప్రశ్నించారు. కావున ఉప ముఖ్యమంత్రి పార్టీ గుర్తు ఉన్న టీషర్టులను ధరించకూడదని పేర్కొన్నారు.



ఉదయనిధి టీషర్టుపై ఉన్న డీఎంకే యువజన విభాగం గుర్తు

## నేడు ప్రెసిడెన్సీ కళాశాలలో జాతీయ సదస్సు

**వడపళని, న్యూస్‌టుడే:** మెరీనాలోని ప్రెసిడెన్సీ కళాశాల (రాజధాని కళాశాల)లో నేడు 'రంగనాథ రామాయణము - మానవీయ విలువలు' అంశంపై ఒక రోజు జాతీయ సదస్సు బుధవారం జరగనుంది. ఉదయం 10 గంటలకు పత్రి అనూరాధ (ఎంఏ రెండో సంవత్సరం) ప్రార్థనా గీతంతో కార్యక్రమం ప్రారంభం కానుంది. కళాశాల తెలుగు శాఖాధ్యక్షురాలు డాక్టర్ ఎన్.ఎలిజబెత్ జయకుమార్ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రామన్, విశిష్ట అతిథిగా డాక్టర్ టీఆర్ఎస్ శర్మ తదితరులు పాల్గొంటారు. మొదటి సమావేశం 11.30, మధ్యాహ్నం 1.00 గంటకు భోజన విరామం, తర్వాత 2 గంటలకు రెండో సమావేశం, 3.30కి సమాపనోత్సవ కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. రాజధాని కళాశాల తెలుగుశాఖ కార్యక్రమానికి వేదిక కానుంది. అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

# మానవ హక్కులపై అవగాహన

**వడపళని, న్యూస్‌టుడే:** జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) ఆధ్వర్యంలో మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు కోయంబత్తూరులో 3, 4 తేదీల్లో రెండు రోజుల పాటు 'రెసిడెన్షియల్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం' జరిగిందని ఎన్‌హెచ్ఆర్సీ ప్రకటన విడుదల చేసింది. అదనపు ఎస్పీ, ఎస్పీ, డీఐటీ హోదాల్లో ఉన్న 45 మంది పోలీసు అధికారులు హాజరయ్యారు. మొదటిరోజు ఎన్‌హెచ్ఆర్సీ ఇండియా డీజీ(ఐ) అజయ్ భట్నాగర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమిళనాడు డీజీపీ శంకర్ జివాల్, కర్ణాటక ఏడీజీ దేవజ్యోతిరాయ్ తదితరులు పాల్గొన్నారు. చట్టప్రకారం మానవ హక్కులను ఎలా వినియోగించుకోవాలనే విషయంలో అధికారుల బాధ్యతను మొదటిరోజు అజయ్ భట్నాగర్ వివరించారు. తమిళనాడు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుడు వి.కణ్ణదాసన్ 'మానవ హక్కులు, పోలీసు అధికారుల పాత్ర' అనే అంశంపై మాట్లాడారు. రెండోరోజు జరిగిన కార్యక్రమంలో ఎన్‌హెచ్ఆర్సీ ఇండియా సెక్రటరీ జనరల్ భరత్‌లాల్ మానవ హక్కుల కోసం పోరాడిన మహాత్మా గాంధీ, డాక్టర్ అంబేడ్కర్, రాజారామ్‌మోహన్ రాయ్ వంటి పలు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు తెలియజేశారు. ఎన్‌హెచ్ఆర్సీ మాజీ సభ్యుడు రాజీవ్ జైన్, జోగిందర్ సింగ్ తదితరులు ప్రసంగించారు.



పోలీసు, ఇతర విభాగ అధికారుల బృందచిత్రం

## నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

**వడపళని, న్యూస్‌టుడే:** విద్యుత్తు శాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మనలి ప్రాంతంలోని పలు వీధుల్లో సరఫరాకు అంతరాయం కలగనుందని అధికారులు ప్రకటనలో తెలిపారు.

## బాణసంచా ఆన్‌లైన్ కొనుగోళ్లతో జాగ్రత్త!

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో బాణసంచా కొనుగోలుపై ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆన్‌లైన్‌లో తీసుకునేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు తక్కువ ధరకే సరఫరా చేస్తామంటూ నకిలీ వెబ్‌సైట్లతో ప్రకటనలు గుప్పిస్తున్నారు. అలాంటివాటిలో డబ్బు చెల్లిస్తే మోసపోయినట్లేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు. జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

# ఉపాధ్యాయుల కోర్కెలు నెరవేర్చుతాం

**మంత్రి అన్బిల్ మహేశ్**



**వేళచ్చేరి, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయుల కోర్కెలను నెరవేర్చుతామని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యామొళి పేర్కొన్నారు. పెరంబులూర్‌లో గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయుల సంఘం 51వ వార్షికోత్సవాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్రన్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి అన్బిల్ మహేశ్ 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన 85 ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను, 100 శాతం ఉత్తీర్ణత వచ్చేందుకు కృషిచేసిన 370 మంది గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులను, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందినవారిని సత్కరించి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉపాధ్యాయుల కోర్కెలను దశల వారీగా నెరవేర్చుతామని తెలిపారు. పెరంబలూర్ జిల్లా కొన్నేళ్లుగా 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ముందుంటుండగా ఈ ఏడాది 8వ స్థానానికి పడిపోయిందన్నారు. మళ్లీ మొదటి స్థానానికి తీసుకురావడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈనెల 15వ తేదీ కోర్టు మంచి తీర్పునిస్తుందని ఎదురు చూస్తున్నామని, తీర్పు వెలువడగానే ఉపాధ్యాయుల కోర్కెలను నెరవేర్చుతామని, గ్రాడ్యుయేట్ పోస్టుల భర్తీకి కోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తున్నామని, పాఠశాలల వద్ద మత్తుపదార్థాల విక్రయాలను అరికట్టడానికి పలు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఉపాధ్యాయుల పని భారాన్ని తగ్గించడానికి ఈఎంఐఎస్ వ్యవస్థను అమలు చేయడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెరంబలూర్ జిల్లా కలెక్టరు గ్రేస్ బచ్చావ్, ఎమ్మెల్యే ప్రభాకరన్, గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర స్థాయి నిర్వాహకులు పలువురు పాల్గొన్నారు.

# కులధ్రువీకరణ పత్రాలు అందించాలని విద్యార్థుల ఆందోళన

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ఈరోడ్ జిల్లా సత్యమంగళం తాలూకా కడంబూర్ కొండ ప్రాంతంలో 3 వేలకు పైగా మలైయాళి సామాజికవర్గానికి చెందిన కుటుంబాలు గత 60 ఏళ్లుగా నివసిస్తున్నాయి. రాష్ట్రంలోని సేలం, ధర్మపురి తిరువణ్ణామలై తదితర 11 జిల్లాలలో ఉంటున్న ఇదే సామాజికవర్గానికి చెందిన ప్రజలు ఎస్టీ జాబితాలో కుల ధ్రువీకరణపత్రాలు పొందారు. కానీ, ఈరోడ్ జిల్లాలోని కడంబూర్, బర్గూర్ కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని మాత్రం ఎస్టీ జాబితాలో చేర్చలేదు. దీంతో 50 ఏళ్లుగా వీరు పలు ప్రభుత్వ పథకాలు అందక ఇబ్బందులు చవిచూస్తున్నారు. కులధ్రువీకరణపత్రాల కోసం ఏళ్ల తరబడి పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో కడంబూర్ కొండ కుత్తియాలత్తూర్ పంచాయతీ కరళియం, కల్‌కడంబూర్, పెరియసాలట్టి, చిన్నసాలపట్టి, ఇరుట్టిపాళయం, కిట్టాంపాళయం, అందియూర్ సహా 21 గ్రామాలకు చెందిన విద్యార్థులు తరగతులను బహిష్కరించి పందిరి ఏర్పాటు చేసుకుని కుల ధ్రువీకరణపత్రాలు అందజేయాలని ప్లకార్డులతో సోమవారం ఆందోళనకు దిగారు. 21 గ్రామాలకు చెందిన ప్రజలు కూడా పాల్గొన్నారు. సత్యమంగళం తహసీల్దార్ శక్తివేల్ అక్కడకు చేరుకుని వారితో చర్చించారు. సానుకూల ప్రకటన రాకపోవడంతో మంగళవారం కూడా ఆందోళన కొనసాగింది.



ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులు, గ్రామస్థులు

## 'డియర్ చెన్నై' పోస్టుకార్డు విడుదల

**సైదాపేట, న్యూస్‌టుడే:** జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా చెన్నైలో తపాలా శాఖ తరఫున 'డియర్ చెన్నై' ఫొటో పోస్టుకార్డును మంగళవారం విడుదల చేశారు. చెన్నై అన్నాసాలైలోని ప్రధాన తపాలా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చెన్నై మండల తపాలా విభాగ ప్రధానాధికారి నటరాజన్, ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీనియర్ సినీనటుడు శివకుమార్ పాల్గొని కార్డు విడుదల చేశారు.



పోస్టుకార్డు విడుదల చేస్తున్న తపాలాధికారి నటరాజన్, సినీనటుడు శివకుమార్

## కోవై కమిషనర్‌కు పవన్‌కల్యాణ్‌పై ఫిర్యాదు

**కోయంబత్తూర్, న్యూస్‌టుడే:** ద్రావిడ తమిళర్ కట్చి అధ్యక్షుడు, న్యాయవాది వెన్మణి కోయంబత్తూర్ పోలీస్ కమిషనర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. అందులో.. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తిరుపతిలో తమిళంలో మాట్లాడేటప్పుడు తమిళనాడులో హిందుమతాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారు. ఇది మతవివాదాలు రేకెత్తించేలా ఉంది. ఆవు కొవ్వుపై మాట్లాడటం ఆది ద్రావిడ, గిరిజన ప్రజలను కించపరిచేలా ఉంది. వారిపై కేసు నమోదు చేయాలని కోరారు. అనంతరం వెన్మణి విలేకరులతో మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల ప్రజల మధ్య ఉద్రిక్తతలు సృష్టించి, మతకల్లోలాలు రెచ్చగొట్టేలా పవన్‌కళ్యాణ్ మాట్లాడారని చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న వెన్మణి

## ఐదుగురి మృతదేహాలు కుటుంబీకులకు అప్పగింత

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** మెరినాలో ఆదివారం ఎయిర్‌షో వీక్షించేందుకు వెళ్లి చనిపోయిన ఐదుగురి మృతదేహాలను పోస్టుమార్టం తర్వాత కుటుంబీలకు అప్పగించారు. కొరుక్కుపేటకు చెందిన జాన్(56), పెరుంగళత్తూర్‌కు చెందిన శ్రీనివాసన్(48), చెంగల్పట్టు వాసి మణి(59), మడువంగరైలో ఉంటూ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ నంద్యాలకు చెందిన దినేష్(41), తిరువొత్తియూర్ చెందిన కార్తికేయన్(34) స్పృహతప్పి పడిపోయి ఆస్పత్రికి తరలించేలోపే మధ్యలోనే మృతి చెందారు. మంగళవారం మృతదేహాలను వారి కుటుంబీకులకు అప్పగించారు. ఐదుగురు మృతికి గుండెపోటే కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

### పోలీసుల కేసు నమోదు

**ఆర్కేనగర్:** ఎయిర్‌షో నేపథ్యంగా ఐదుగురు మృతి చెందిన వ్యవహారంపై అన్నాస్క్వేర్, తిరువల్లికేణి, మైలాపూర్, మెరినా పోలీస్‌స్టేషన్‌లలో వేర్వేరుగా కేసులు నమోదు చేశారు.



# పాప్పాక్కుడి పంచాయతీ అధ్యక్షురాలి రాజీనామా?

**ఉపాధ్యక్షుడి తీరుతో నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం**

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** తిరునెల్వేలి జిల్లా పాప్పాక్కుడి పంచాయతీ అధ్యక్షురాలిగా డీఎంకేకు చెందిన పూంగోద్దై, ఉపాధ్యక్షుడిగా డీఎంకే యూనియన్ కార్యదర్శి మారవన్నముత్తు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో పూంగోద్దై తనను వెంటనే పదవి నుంచి విముక్తురాలిని చేయాలని జిల్లా కలెక్టర్‌కు గత నెల 18వ తేదీ వినతి అందజేసినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉపాధ్యక్షుడు మారివన్నముత్తు పలు విధాలుగా ఆమెను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దళిత మహిళ అయిన పూంగోద్దైతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని, అందుకే ఆమె రాజీనామా చేసినట్టు పూంగోద్దై పలువురి వద్ద వాపోయినట్లు సమాచారం. దీనిపై ఆరా తీయగా రెండేళ్ల ముందు వరకు పాప్పాక్కుడి జనరల్ నియోజకవర్గంగా ఉండేది. రెండేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రత్యేక నియోజకవర్గంగా మారింది. జనరల్ నియోజకవర్గంగా ఉన్నంత కాలం మారివన్నముత్తు, ఆయన సతీమణి చక్రం తిప్పారు. ప్రత్యేక నియోజకవర్గంగా మారిన తర్వాత పూంగోద్దైకి అధ్యక్షురాలి పదవి దక్కింది. అందువల్ల మారివన్నముత్తు ఆమెను తన ఆధీనంలో ఉంచుకొని తెరవెనుక అధికారం చెలాయిస్తున్నారు. ఒక దశలో పూంగోద్దై అతని మాట వినకుండా తన ఇష్టానికి వ్యవహరించడంతో మారివన్నముత్తు ఆమెను ఇంటికి వెళ్లి బెదిరించినట్టు సమాచారం. దీంతో పూంగోద్దై రాజీనామా చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ కార్తికేయన్‌కు లేఖ పంపగా ఇంతవరకు దానిని పరిశీలించలేదని చెబుతున్నారు. దీని గురించి కలెక్టర్ కార్తికేయన్ మాట్లాడుతూ.. పూంగోద్దై ముందే రెండుసార్లు రాజీనామా లేఖ అందజేసినట్టు గుర్తు చేశారు. ఆమె బయటి ఊరిలో ఉన్నట్టు, పంచాయతీ యూనియన్ కార్యాలయానికి సక్రమంగా రావడంలేదని ఉపాధ్యక్షుడు ఆరోపిస్తున్నట్టు చెప్పారు. ఇరువర్గాలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజీనామా వ్యవహారంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు.



పెరిగిన ఆవిన్ ఐస్‌క్రీమ్ ధరలు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ఆవిన్ సంస్థ ఐస్‌క్రీమ్ ధరలు పెంచింది. రాష్ట్ర ప్రభుత్వ సహకార పాలసంస్థ ఆవిన్‌లో 100కు పైగా ఐస్‌క్రీమ్ రకాలను తయారు చేసి రాష్ట్రవ్యాప్తంగా విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెంచిన ఐస్‌క్రీమ్ ధరలు ఈ నెల 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయి. దీని గురించి తమిళనాడు పాల ఏజెంట్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొన్నుసామి మాట్లాడుతూ.. పాల కొనుగోలు ధర పెరగకుండానే ఐస్‌క్రీమ్ ధరలు పెంచడం ఆమోదయోగ్యం కాదన్నారు. అదే సమయంలో వివాహాది శుభకార్యాలకు ఉపయోగిస్తున్న 4,500 మి.గ్రా బల్క్ ఐస్‌క్రీమ్ రకాలపై రూ.80 నుంచి రూ.100 వరకు తగ్గించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు.



పార్కులో విరగబూసిన పుష్పాలు

## కున్నూర్ సిమ్స్ పార్కులో కనువిందుచేస్తున్న పుష్పాలు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** నీలగిరి జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కున్నూర్‌లోని సిమ్స్ పార్కులో విరగబూసిన పుష్పాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. సిమ్స్ పార్కులో రెండో సీజన్‌కి నాటిన 1.90 లక్షల మొక్కలకు పువ్వులు పూశాయి. రెండో సీజన్‌కు అమెరికా, జపాన్, ఫ్రాన్స్ తదితర పలు దేశాలకు చెందిన సాల్వియా, ఫ్లాగ్స్ , కాస్మోస్ జినియా, బిగోనియా, డాల్ఫినియం తదితర 75 రకాల 1.90 లక్షల పువ్వుల మొక్కలను నాటారు. ప్రస్తుతం వీటికి పుష్పాలు విరగబూస్తున్నాయి. పర్యాటకులు పుష్పాలను ఆసక్తిగా తిలకిస్తూ మంత్రముగ్ధులవుతున్నారు.

## గంజాయి వినియోగంలో 35వ స్థానం

**పోలీసుశాఖ వెల్లడి**

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** గంజాయి వినియోగంలో రాష్ట్రం 35వ స్థానంలో ఉందని పోలీసు శాఖ తెలిపింది. రాష్ట్రంలో మత్తుపదార్థాల నియంత్రణకు సంబంధించి చర్యలు చేపట్టడంలేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో చెన్నై డీజీపీ కార్యాలయం నివేదిక విడుదల చేసింది. జాతీయ సగటు 1.2శాతం కాగా తమిళనాడులో 0.1 శాతంగా ఉందని పేర్కొంది. రాష్ట్రంలో మత్తుమందుల వాడకం 0.3 శాతం కాగా జాతీయ సగటు 1.08 శాతమని తెలిపింది. పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రగ్స్ లభ్యం కాకుండా నిరోధించేందుకు రాష్ట్ర స్థాయి నార్కో కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

## గిండి రేస్‌కోర్స్‌లో 4 కొత్త కొలనులు



జేసీబీతో పనులు ప్రారంభించిన దృశ్యం

**మహాబలిపురం, న్యూస్‌టుడే:** గిండి రేస్‌కోర్స్ క్లబ్‌లో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ తరఫున కొత్తగా 4 కొలనులు తవ్వే పనులు ప్రారంభించారు. వేళచ్చేరిలోని చెరువు ఆక్రమణలతో విస్తీర్ణం తగ్గడం, అందులో మురుగు, చెత్త కలవడంతో కలుషితమవుతోంది. చెరువును కాపాడటానికి చెరువుల పరిరక్షణ ఉద్యమ ఉపాధ్యక్షుడు కుమారదాసన్ ట్రైబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం వేళచ్చేరి చెరువును వరదల నుంచి కాపాడేందుకు గిండీ రేస్ కోర్స్ మైదానంలో కొలనులు నిర్మించొచ్చని సూచించింది. ఆ మేరకు ప్రభుత్వ అభిప్రాయాన్ని కూడా కోరింది. వరద నీటిని సేకరించేందుకు రేస్‌కోర్స్ క్లబ్‌లో కొత్తగా నీటి వనరులను సృష్టించడం చక్కటి పరిష్కారమని ట్రైబ్యునల్ పేర్కొంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంబంధిత శాఖల కార్యదర్శులతో సంప్రదింపులు జరిపి రేస్‌కోర్స్ క్లబ్ ప్రాంతంలో నీటి నిల్వకు కొలనులు నిర్మించాలా వద్దా అని వివరణ అడిగారు. పిటిషన్ తదుపరి విచారణ 14న జరగనుంది. ఈ నేపథ్యంలో కొలనులు తవ్వే పనులను ప్రారంభించారు.

## కోయంబత్తూరుకు వీక్లీ ప్రత్యేక రైలు

**వడపళని, న్యూస్‌టుడే:** ఆయుధ పూజ, దీపావళి పండుగలకు సొంతూర్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం - కోయంబత్తూరు మార్గంలో వీక్లీ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ రైల్వే మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

● **06184** తాంబరంలో 11, 18, 25, నవంబరు 1, 8, 15, 22, 29 (శుక్ర) 18.00కు బయలుదేరి మరుసటి రోజు 08.10కి కోయంబత్తూరు చేరుతుంది. ● **06185** కోయంబత్తూరులో 13, 20, 27 నవంబరు 3, 10, 117, 24 డిసెంబరు 1 (ఆది) 23.45కు బయలుదేరి మరుసటి రోజు 12.30కి తాంబరానికి వస్తుంది. రిజర్వేషన్లు ప్రారంభమయ్యాయి.

**సమయంలో మార్పు...** తిరుచ్చిరాపల్లి డివిజన్‌లో జరుగుతున్న ఇంజినీరింగ్ పనుల కారణంగా ● **06070** తిరునెల్వేలి - చెన్నై ఎగ్మూరు 10న 18.45కు బయలుదేరాల్సిన రైలు 20.15 గంటలకు ఆలస్యంగా నడుస్తుంది.

# సామ్‌సంగ్ కార్మికులు తిరిగి విధుల్లో చేరాలి: టీఆర్బీ రాజా

**సైదాపేట, న్యూస్‌టుడే:** పలు డిమాండ్లతో సమ్మెబాట పట్టిన సామ్‌సంగ్ సంస్థ కార్మికులు తిరిగి విధుల్లోకి చేరాలని పరిశ్రమలశాఖ మంత్రి టీఆర్బీ రాజా సూచించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో చెన్నై సచివాలయంలో మంత్రివర్గ సమావేశం మంగళవారం జరిగింది. తర్వాత టీఆర్బీ రాజా విలేకరులతో మాట్లాడుతూ... సామ్‌సంగ్ కార్మికుల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ఏడుసార్లు కార్మికశాఖ తరఫున యాజమాన్యంతో చర్చలు జరిపినట్లు చెప్పారు. ముగ్గురు మంత్రులు కలిసి మూడు గంటలపాటు చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. మొదట సంస్థ, తర్వాత సీఐటీయూ, దాని అనుబంధ సంస్థలతో మాట్లాడామని తెలిపారు. సీఐటీయూ రిజిస్ట్రేషన్ చేయాలని ఆందోళన చేస్తున్న కార్మికులు కోరుతున్నారని, వారి మిగతా కోరికలన్నీ ఆమోదించినట్లు తెలిపారు. సీఐటీయూ రిజిస్ట్రేషన్ గురించి కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున ఏమీ చేయలేమని సంస్థ తెలిపిందని, ఆ ఒక్క కారణంతో సమ్మె కొనసాగిస్తున్నారని వివరించారు. విధులు నిర్వర్తించని ఒక్కోరోజు కార్మికుల కుటుంబాలకు నష్టం ఏర్పడుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తిరిగి విధుల్లో చేరాలని సూచించారు. సీఐటీయూ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన కేసు ముగిసిన వెంటనే నమోదుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


తిరువణ్ణామలై: కామధేనువు వాహనంపై పరాశక్తి అమ్మవారు


వేళచ్చేరి: గజలక్ష్మి అలంకరణలో శక్తి అమ్మవారు


పళ్లిపట్టు: అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు

# కామధేనువుపై పరాశక్తి కటాక్షం

**తిరువణ్ణామలై, న్యూస్‌టుడే:** తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలోని వినాయక మండపంలో పరాశక్తి అమ్మవారికి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో ఆరో రోజైన మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు జరిగాయి. సాయంత్రం ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి కామధేనువు వాహనంపై కొలువుదీర్చి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

## అన్నపూర్ణాదేవిగా కన్యకా పరమేశ్వరి

**పళ్లిపట్టు:** పళ్లిపట్టు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అదేవిధంగా స్థానిక శ్రీకొళ్లాపురమ్మ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణిగా అలంకరించారు.

## గజలక్ష్మిగా శక్తి అమ్మవారు

**వేళచ్చేరి, న్యూస్‌టుడే:** చెన్నై వడపళని ఆండవర్ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం శక్తి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, దీపారాధన చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు గజలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, వేద పారాయణం జరిగాయి. తర్వాత శివాలయ నాట్యాలయ విద్యార్థుల భరతనాట్యం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. రాత్రి నాగై మకుందన్ భక్తి ప్రసంగం నిర్వహించారు.

# ప్రత్యేక పథకాల అమలుపై సమీక్ష

**వేళచ్చేరి, న్యూస్‌టుడే:** చెన్నై సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ నేతృత్వంలో మంగళవారం ప్రత్యేక పథకాల అమలు తీరు, ఉత్తర చెన్నైలో జరుగుతున్న అనేక పథకాల పురోగతిపై సమీక్ష మంగళవారం నిర్వహించారు. సమావేశంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, సెంథిల్ బాలాజీ, మా.సుబ్రమణియన్, శేఖర్‌బాబు, అన్బిల్ మహేశ్ పొయ్యమొళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, అదనపు కార్యదర్శులు, వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

## వర్షాకాల ముందస్తు జాగ్రత్త చర్యలపై...

**సైదాపేట:** చెన్నై, కాంచీపురం విద్యుత్ పంపిణీ మండలాల్లో ఈశాన్య రుతుపవనాల వర్షాలను ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ తీసుకున్న ముందస్తు చర్యలపై సమీక్ష మంగళవారం తమిళనాడు విద్యుదుత్పత్తి, పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగింది. దీనికి శాఖ మంత్రి సెంథిల్‌బాలాజీ నేతృత్వం వహించారు. విద్యుత్ బోర్డు అధికారులు అన్ని వేళలా ప్రజల సేవలో ఉండాలని సూచించారు. సమాచారానికి ఎలాంటి ఇబ్బంది పడకుండా తగిన ఉపకరణాలు కొనుగోలు చేయాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయానికి సంబంధించి ప్రజలు 24 గంటలూ పనిచేసే 94987 94987 అనే నెంబర్‌కు సంప్రదించాలని మంత్రి సూచించారు.


సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఇతర మంత్రులు, అధికారులు


సైదాపేట: సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సెంథిల్ బాలాజీ


నీటి నిల్వను పరిశీలిస్తున్న కలెక్టరు చంద్రకళ తదితరులు

# అనైకట్టు జలాశయ సందర్శన

**అరక్కోణం, న్యూస్‌టుడే:** రాణిపేట జిల్లా నెమిలి సమీప పొన్నై వద్ద నున్న అనైకట్టు జలాశయ ఆనకట్టను మంగళవారం కలెక్టరు చంద్రకళ పరిశీలించారు. అదేవిధంగా వాలాజాపేట యూనియన్ దేవదానం గ్రామం మీదుగా ప్రవహించే కుడిమల్లూరు, పింజిచెరువు కాలువలను ఆమె పరిశీలించారు. వెంట నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు ప్రభాకర్, సహాయ ఇంజినీర్లు చంద్రన్, రాజేంద్రన్ ఉన్నారు.

# కాలువల్లో పూడిక తీయలేదని రాస్తారోకో

**వేలూర్, న్యూస్‌టుడే:** వేలూర్‌లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో సత్తువాచ్చారిలోని వసంతనగర్ ఎక్స్‌టెన్షన్, శ్రీరాంనగర్ తదితర ప్రాంతాలలోని గృహాలలోకి వరదనీరు చొరబడింది. కాలువల్లో పూడికతీయకపోవడంతో తమ ఇళ్లలోకి నీరు వచ్చిందని ఆరోపిస్తూ వసంతనగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతానికి చెందిన ప్రజలు మంగళవారం ఉదయం వళ్లలార్ బస్టాప్ వద్ద రాస్తారోకోకు దిగారు. సత్తువాచ్చారి పోలీసులు వారితో మాట్లాడటంతో శాంతించారు.


రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం


ఆందోళన నిర్వహిస్తున్న పీఎంకే కార్యకర్తలు

# శ్రీలంక దౌత్య కార్యాలయ ముట్టడి

**సైదాపేట, న్యూస్‌టుడే:** పీఎంకే తరఫున శ్రీలంక దౌత్య కార్యాలయ ముట్టడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శ్రీలంక నావికాదళం దౌర్జన్యాలకు గురవుతున్న రాష్ట్ర జాలర్లను రక్షించాలని, ప్రస్తుతం శ్రీలంక చెరలో ఉన్న తమిళనాడు మత్స్యకారులను విడిపించాలని, జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూరగొనాలని డిమాండ్ చేస్తూ చెన్నైలోని శ్రీలంక దౌత్య కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు పీఎంకే ప్రకటించింది. ఆ మేరకు మంగళవారం వళ్లువర్‌కోట్టం వద్దకు పీఎంకే శ్రేణులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అనంతరం శ్రీలంక దౌత్య కార్యాలయాన్ని ముట్టడించేందుకు బయలుదేరారు. వారిని అడ్డుకున్న పోలీసులు ఐదుమంది మాత్రమే వినతిపత్రం సమర్పించేందుకు అనుమతించారు.

# ఎండు చేపల విక్రయాలు కుదేలు

**తిరుత్తణి, న్యూస్‌టుడే:** పెరటాసి మాసం కావడంతో హిందువులు చాలామంది మాంసాహారానికి దూరంగా ఉండటంతో చేపలు, మాంసం విక్రయాలు సన్నగిల్లాయి. ఈ క్రమంలో ఎండు చేపలు అమ్ముడుపోక తేమకు మెత్తగా అవుతున్నాయి. దీంతో వ్యాపారులు పాడవుతాయని ఎండబెట్టుకుంటున్నారు. తిరుత్తణి మెట్టు వీధిలోని ఎండు చేపల మండి వ్యాపారులు మాట్లాడుతూ.. పెరటాసి మాసంలో విక్రయాలు తగ్గాయని, ఎండు చేపలు చెడిపోకుండా ఎండలో ఆరబెడుతున్నామని చెప్పారు.


చేపలు ఎండలో ఆరబెడుతున్న దృశ్యం


సైదాపేట: రాయపురంలో మాజీ మంత్రి జయకుమార్ నేతృత్వంలో మానవహారం


అరక్కోణంలో..


సైదాపేట: ఊటీలో..


పళ్లిపట్టు: పొదట్టూరుపేటలో..

# ప్రజలపై పన్నుల భారం తగ్గించాలి

**రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్నాడీఎంకే మానవహారాలు**

**సైదాపేట, న్యూస్‌టుడే:** డీఎంకే ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం మోపడాన్ని నిరసిస్తూ అన్నాడీఎంకే తరఫున ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ఆదేశాలతో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా మానవహారం కార్యక్రమాలు జరిగాయి. చెన్నై రాయపురంలో మాజీ మంత్రి జయకుమార్, కోడంబాక్కంలో జిల్లా కార్యదర్శి టీనగర్ సత్య, అన్నానగర్‌లో ప్రాంతీయ కార్యదర్శి దశరథన్, తండైయార్‌పేటలో ఆర్ఎస్ రాజేష్, షోలింగనల్లూరులో కేపీ కందన్ నేతృత్వంలో మానవహారాలు నిర్వహించారు. అదేవిధంగా సేలం, తిరుప్పూరు, కడలూరు, ఊటీ తదితర ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో నిర్వాహకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**అరక్కోణం:** రాణిపేట జిల్లాలోని రాణిపేట, వాలాజాపేట, ఆర్కాడు, విషారం, అమ్మూరు, విలాపాకం, తిమిరి, కలవై తదితర ప్రాంతాల్లో ఆయా పట్టణ పంచాయతీలు, మున్సిపాలిటీ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. అరక్కోణం మున్సిపల్ కార్యాలయం ఎదుట పార్టీ జిల్లా కార్యదర్శి, అరక్కోణం ఎమ్మెల్యే ఎస్.రవి నేతృత్వంలో మానవహారంగా నిలబడి డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాంచీపురం:** కాంచీపురం దక్షిణ జిల్లా అన్నాడీఎంకే తరఫున రెట్టమండపం వద్ద నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి వి.సోమసుందరం ప్రారంభించారు. పార్టీ నిర్వాహకులు, మాజీ ఎమ్మెల్యే కాంచీ పన్నీర్‌సెల్వం, పార్టీ ప్రతినిధి బాలాజీ, అప్పు అలియాస్ వళ్లినాయకం, సోము, కార్యకర్తలు పాల్గొని డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గాంధీరోడ్డు, ఓరిగై మిలిటరీ రోడ్డు, వాలాజాబాద్‌తో పాటు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో మానవహారం నిర్వహించారు.

**కోయంబత్తూరు:** కోయంబత్తూరు నగరంలోని మునియముత్తూర్ బస్టాండ్ ఎదుట మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి నేతృత్వంలో ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ వేలుమణి విలేకరులతో మాట్లాడుతూ.. ఏటా పన్నులు పెంచడంతో ప్రజలు ఎంతగానో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపుతో కోవైలోని వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని వ్యాపారులను ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో మత్తుపదార్థాల చలామణి అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. భద్రత కొరవడటంతోనే మెరినాలో మరణాలు సంభవించాయని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు ఉద్యోగం, ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు.

**పళ్లిపట్టు:** పళ్లిపట్టు తాలూకా పొదట్టూరుపేటలో జరిగిన కార్యక్రమానికి పట్టణ కార్యదర్శి ఏజీ రవిచంద్రన్ అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి బీవీ రమణ, మాజీ ఎంపీ జి.హరి, పళ్లిపట్టు యూనియన్ కార్యదర్శి టీడీ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

**తిరువణ్ణామలై:** తిరువణ్ణామలైలో జరిగిన కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి, మాజీమంత్రి రామచంద్రన్ అధ్యక్షత వహించారు. ఆస్తిపన్ను, తాగునీటి పన్నులు రద్దు చేయాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పెరియార్ విగ్రహం, అన్నా, గాంధీ, కామరాజర్ విగ్రహాల వరకు 3 కి.మీ. మేర మానవహారంగా నిల్చున్నారు.


కోయంబత్తూరు: మాట్లాడుతున్న ఎస్పీ వేలుమణి

# రేషన్ దుకాణం ప్రారంభం

**అరక్కోణం, న్యూస్‌టుడే:** రాణిపేట జిల్లా అరక్కోణం యూనియన్ అనంతాపురం పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.14.08 లక్షల వ్యయంతో రేషన్ దుకాణ భవనాన్ని నూతనంగా నిర్మించారు. దీని ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో అరక్కోణం ఎమ్మెల్యే ఎస్.రవి ముఖ్యఅతిథిగా పాల్గొని దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డుదారులకు సరకులు అందజేశారు. డీఎంకే నిర్వాహకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు

**తిరుమల, న్యూస్‌టుడే:** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమలకు భక్తులు భారీగా పోటెత్తారు. దీంతో మధ్యాహ్నానికే ఆలయ మాడవీధుల్లోని గ్యాలరీలన్నీ నిండిపోవడంతో భక్తులు మూలమూర్తి దర్శనానికి వెళ్లాల్సిందిగా తితిదే ప్రకటించింది. దీంతో పెద్దయెత్తున భక్తులు రింగ్‌రోడ్డుకు చేరుకున్నారు. అనంతరం నాలుగు గంటల నుంచి సర్వదర్శనానికి అనుమతించారు. సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా మంగళవారం సాయంత్రానికి క్యూలైన్‌లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయి బాటగంగమ్మ ఆలయం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి దాదాపు 24 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని ఐదు కంపార్ట్‌మెంటులో వేచి ఉన్నారు. వీరికి మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. సోమవారం శ్రీవారిని 81,481 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.31 కోట్లు హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ కొనసాగుతోంది.

# కాలినడక భక్తులకు పహారా

**తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే:** తిరుమల బ్రహ్మోత్సవాలకు పాదయాత్రతో మెట్ల మార్గంలో తరలివచ్చే భక్తులకు రక్షణగా తితిదే అటవీశాఖ ఆధ్వర్యంలో వైల్డ్ యానిమల్ సెన్సార్లు, షాక్ పరికరాలను సిబ్బందికి సమకూర్చింది. మంగళవారం గరుడసేవ సందర్భంగా శ్రీవారిమెట్లు, అలిపిరి నడకమార్గాల్లో అటవీ కార్మికులు సెన్సార్లతో రక్షణ చర్యల్లో పాల్గొన్నారు. ఈ పరికరం పది అడుగుల దూరంలో ఏదైనా వన్యప్రాణిగాని, చిరుతలు, ఎలుగుబంట్లు ఉన్నా గుర్తించగలదు. తద్వారా పరికరాన్ని నిర్వహించే కార్మికుడు సైరన్ మోగించి, వన్యప్రాణులను భయపెట్టే ప్రయత్నం చేయవచ్చు. అలానే సమీపంలో ఉండే తోటి కార్మికులను అలర్ట్ చేయవచ్చు. అంతేకాకుండా పరికరం చివర భాగంతో పది అడుగుల దూరం నుంచే వన్యప్రాణికి షాక్ కొట్టించి, అక్కడి నుంచి పారిపోయేలా చేయవచ్చు.


సైదాపేట: వేలూరులో...


తిరువణ్ణామలైలో..


కాంచీపురం: మాజీ మంత్రి వి.సోమసుందరం

# బస్సు ఢీకొని తల్లి, కుమారుడి మృతి

**మహాబలిపురం, న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదంలో తల్లీ, కుమారుడు దుర్మరణం చెందారు. చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాళ్‌కోవిల్ ముత్తు మారియమ్మన్ ఆలయం వీధిలో నివాసం ఉండే ఆంటోని, జయశ్రీ(32) దంపతులు. వారి కుమారుడు ఆలన్(15) అంజూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. జయశ్రీ, ఆలన్ సింగపెరుమాళ్ కోవిల్‌లోని విద్యుత్తు కార్యాలయంలో బిల్లు చెల్లించడానికి సోమవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై వచ్చారు. తిరుగు ప్రయాణంలో వాహనాన్ని ఆలన్ నడిపాడు. జీఎస్టీ రోడ్డు-ఒరగడం క్రాస్‌లో రోడ్డు దాటుతుండగా తిరువణ్ణామలై నుంచి చెన్నై అడయార్‌కు వెళుతున్న ప్రభుత్వ బస్సు ప్రమాదవశాత్తు ఢీకొనడంతో తల్లీ, కుమారుడు బస్సుచక్రాల కింద పడి ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరైమలైనగర్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను చెంగల్పట్టు ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్, కళ్లకురిచ్చికి చెందిన యువరాజ్‌ను తాంబరం ట్రాఫిక్ పోలీసులు అరెస్టు చేశారు.


జయశ్రీ, ఆలన్ (పాత చిత్రాలు)

# ఉత్తరాది కార్మికుడి దారుణహత్య

**శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే:** కాంచీపురం జిల్లా మాంగాడు భరణిపుత్తూర్ లీలావతి నగర్ ప్రాంతంలో ప్రభాకరన్ అనే వ్యక్తి కొయ్య మిల్లు (సామిల్) నిర్వహిస్తున్నాడు. ఇక్కడ ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనిల్ పాండే (43), దినేష్ ద్రౌపది (38) ఏడాదిగా పనిచేస్తున్నారు. 10 రోజుల క్రితం ఇక్కడే పనిచేస్తున్న గిండికి చెందిన కుమార్ (48).. అనిల్ పాండే గదిలో ఉంటూ పనికి వెళ్తున్నాడు. సోమవారం సాయంత్రం అనిల్ పాండే, దినేష్ ద్రౌపది కలిసి కుమార్ సెల్‌ఫోన్ దాచిపెట్టి అతనికి కోపం వచ్చేలా ఎగతాళి చేశారు. కుమార్ తన సెల్‌ఫోన్ ఇవ్వాలని చాలాసేపు బతిమాలాడు. చాలాసేపటి తర్వాత అనిల్ పాండే సెల్‌ఫోన్ ఇచ్చాడు. దీంతో ఆగ్రహించిన కుమార్ మంగళవారం వేకువజామున నిద్రిస్తున్న అనిల్ పాండే తలపై ఇనుపరాడ్డుతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అనిల్‌పాండే అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మాంగాడు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# దుకాణదారుడిపై దాడి

**వడపళని, న్యూస్‌టుడే:** రూపాయి ఊరగాయ ప్యాకెట్లు లేకపోవడంతో దుకాణదారుడిపై కొనుగోలుదారుడు దాడిచేశాడు. కోడంబాక్కంలోని ఓ దుకాణానికి మంగళవారం వచ్చిన ఓ కొనుగోలుదారుడు రూపాయి ఊరగాయ ప్యాకెట్లు కావాలని అడిగాడు. దుకాణదారుడు లేదని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో దుకాణ యజమాని హజారుద్దీన్‌పై కొనుగోలుదారుడు దాడి చేయడంతో తలకు బలమైన గాయమైంది. బాధితుడు కీల్పాక్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# కనులపండువగా గరుడవాహన సేవ

**తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే:** తిరుపతి పట్టణంలోని తుమ్మలగుంట గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవరోజు గరుడ వాహనసేవ కనులపండువగా సాగింది. ఉదయం అర్చకులు స్వామివారికి నిత్య కట్ల కైంకర్యాలు శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళవారం రాత్రి స్వామివారిని వాహన మండపంలో గరుడ వాహనంపై కొలువుదీర్చి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. వాహనం ముందు కోలాటాలు, చెక్కభజనలు, డప్పుల వాయిద్యాలు ముందుకు సాగుతుండగా వాహన సేవ కనులపండువగా సాగింది. ఉదయం మోహినీ అలంకరణలో స్వామివారు గ్రామంలో ఊరేగారు. మండలంలోని పరిసర గ్రామాల నుంచి, తిరుపతి నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి గోవింద నామస్మరణలు చేస్తూ, స్వామివారికి కర్పూర హారతులు సమర్పించి దర్శించుకున్నారు.

# కొప్పెర ట్రస్టు అన్నదానం

**తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే:** శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొప్పెర ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సుమారు 800 మంది భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ఫౌండర్ కె.సాయిసురేష్, ట్రస్టీ కె.రుక్మిణమ్మ, చంద్రమోహన్, లలిత, రమేష్, రెడ్డిశేఖర్, మురళి, మధు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.


చెన్నై సచివాలయంలో మంగళవారం జలవనరులశాఖ మంత్రి దురైమురుగన్ నేతృత్వంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ అధ్యక్షతన ఈశాన్య రుతుపవనాల వర్షాల నేపథ్యంలో చేపడుతున్న ముందస్తు జాగ్రత్త చర్యల గురించి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, సెంథిల్ బాలాజీ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. – వేళచ్చేరి, న్యూస్‌టుడే

# గొలుసు దొంగకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

**యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే:** నడుచుకుంటూ వెళ్తున్న యువతి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పరుగెడుతున్న యువకుడిని స్థానికులు పట్టుకొని, దేహశుద్ధి చేసిన ఘటన మధురానగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... హైదరాబాద్‌లోని ఎల్లారెడ్డిగూడ, జయప్రకాష్ నగర్ ప్రాంతంలోని వసతి గృహంలో ఉంటున్న నాగసాయి లహరి ప్రైవేటు ఉద్యోగిని. మంగళవారం ఉదయం వసతిగృహం నుంచి సమీపంలోని కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తుంది. తమిళనాడులోని ధర్మపురికి చెందిన నితిన్ యువతిని అనుసరించి ఆమె మెడలోని బంగారు గొలుసు తెంపుకొని పరుగెత్తడానికి ప్రయత్నించాడు. యువతి కేకలు వేస్తూ అతడి వెంట పరుగెత్తింది. అప్రమత్తమైన స్థానికులు నితిన్‌ను పట్టుకొని దేహశుద్ధి చేసి మధురానగర్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.